## క్లుప్తంగా

### విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



మోడల్ స్కూల్ విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ ప్రారంభోత్సవంలో డీఎస్పీ సీతారామయ్య

మంత్రాలయం: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డీఎస్పీ సీతారామయ్య పేర్కొన్నారు. మండలంలోని రచ్చుమర్రి ఏపీ ఆదర్శ పాఠశాలలో ఆర్డీటీ ఆధ్వర్యంలో 186 మంది విద్యార్థినీ, విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ బాగా చదువుకుని ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. ప్రతిభతో తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఆర్డీటీ సంస్థ అందజేసిన సైకిళ్లను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పట్టుదలతో చదివితేనే ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చన్నారు. సంస్థ రీజినల్ డైరెక్టర్ రామేశ్వరి, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కిరణ్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### మెడికల్ కళాశాలలో నియామకాలు

ఆదోనిటౌన్: ఆదోని మెడికల్ కళాశాలలో 57 సీనియర్ రెసిడెంట్ నియామకాలు చేపట్టనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కె.వాణిశ్రీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16వ తేదీన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆదోని ఏరియా ఆస్పత్రిలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నామని ఆమె తెలిపారు. మరిన్ని వివరాలకు హెచ్‌టీటీపీ://కర్నూల్‌మెడికల్‌కాలేజ్ కర్నూల్ డాట్ ఏపీ డాట్ ఇన్ వెబ్ సైట్‌ను సంప్రదించాలన్నారు.

### దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

కౌతాళం: కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు సమర్పించి ప్రార్థనలు చేశారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. అధికంగా తరలివచ్చిన భక్తులు స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. అంతకు ముందు తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాష చిష్తీలు స్వామివారి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాలను చేపట్టారు. భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.


### వెల్ఫేర్ అసిస్టెంట్ల నియామకం



బాధ్యతలు తీసుకుంటున్న వెల్ఫేర్ అసిస్టెంట్లు

కౌతాళం: మండలానికి ఇద్దరు వెల్ఫేర్ అసిస్టెంట్లు నియమితులైనట్లు ఎంపీడీఓ సుబ్బారాజు తెలిపారు. ఈ మేరకు గురువారం వారు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. కారుణ్య నియామకాల ప్రాతిపదికన మండలంలోని వివిధ సచివాలయాలకు కొత్తగా బుధవారం నలుగురు వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లను నియమించగా గురువారం మరో ఇద్దరిని జిల్లా కలెక్టర్ నియమించినట్లు తెలిపారు. వీరికి మండలంలోని ఆయా గ్రామాలను కేటాయించినట్లు తెలిపారు. షబరేష్‌ను ఉరుకుంద, నరసింహ స్వామిని కౌతాళం సచివాలయం-3కి నియమించినట్లు ఆయన తెలిపారు.

### సమస్యల పరిష్కారమే స్పందన ధ్యేయం



మున్సిపల్ కమిషనర్ దరఖాస్తు అందజేస్తున్న వృద్ధుడు వెంకటేష్

ఆదోనిటౌన్: ప్రజా సమస్యల పరిష్కారమే స్పందన కార్యక్రమం లక్ష్యం అని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి తెలిపారు. గురువారం 19వ వార్డు ఆర్టీసీ కాలనీ-2 సచివాలయం ఆవరణలో స్పందన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆర్టీసీ కాలనీ ప్రాంతానికి చెందిన మహిళలు, వృద్ధులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. దరఖాస్తులను పరిశీలించి పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు సిఫారసు చేశారు. నిర్ణీత సమయంలోనే ఆయా సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ తెలిపారు. ఇంటి పట్టాల కోసం ముగ్గురు, మురుగు కాలువలు ఏర్పాటు చేయాలని ఇద్దరు దరఖాస్తు చేసుకున్నారు. చిన్నచిన్న సమస్యలను కమిషనర్‌కు దాదాపు 20 మంది మేర వివరించారు. ఆయా సమస్యలను ఒకటి, రెండు రోజుల్లోనే పరిష్కరించడం జరుగుతుందని సమాధానంగా చెప్పారు. ఎంఈ రాధాకృష్ణ, మహీంద్ర, రామంజి, చిన్నా పాల్గొన్నారు.

# పేదల అభ్యున్నతికి జగనన్నే సీఎం కావాలి

● ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి



చాగిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిరూరల్: సంక్షేమ రథ సారథి వైఎస్ జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం మండలంలోని చాగి గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు 250 గృహాలను సందర్శించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. నవరత్నాల పథకాలు సక్రమంగా అందుతున్నాయా కాలనీలో మంచినీరు, వీధి దీపాలు, డ్రెయినేజీ, రోడ్లు వంటి సమస్యలు ఉన్నాయా ఆరా తీస్తూ ముందుకెళ్లారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాల ద్వారా వైఎస్ జగనన్న ప్రజలకు నేనున్నాననే భరోసా కల్పించారన్నారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా ప్రజలకు ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. తన దృష్టికి తెచ్చిన సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీడీఓ గీతావాణి, ఆర్ఐ జయరామిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు రమేష్, గ్రామ సర్పంచ్ సరళమ్మ, పురుషోత్తం, నాయకులు కామాక్షి తిమ్మప్ప, దేవిశెట్టి మంజుల, రేణుక, శ్రీలక్ష్మి, గురునాథ్‌రెడ్డి, నరసింహమూర్తి, రామలింగేశ్వరయాదవ్, పంపన్నగౌడ్, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నేత నిలువునా ముంచాడు - న్యాయం చేయండి



ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి గోడు వెల్లబోసుకుంటున్న బాధితురాలు సరస్వతి

ఆదోనిఅర్బన్: మండలంలోని చాగి గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో సోలార్ ప్లాంట్ కోసం తమ 9 ఎకరాల పొలాన్ని మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు బామ్మర్ది రంగస్వామికి అమ్మినానని, ఇప్పటివరకు చిల్లిగవ్వ కూడా ఇవ్వకుండా బెదిరింపులకు దిగుతున్నారని బాధితురాలు సరస్వతి ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి దృష్టికి తెచ్చారు. గురువారం చాగి గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యేకు ఆమె గోడును వెల్లబోసుకుంది. సోలార్ ప్లాంట్ ఏర్పాటు కోసం ప్రభుత్వానికి భూమి అమ్మాలని నమ్మించి తమ 9 ఎకరాల పొలాన్ని (ఎకరం రూ.3 లక్షలు చొప్పున) మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు బామ్మర్ది రంగస్వామికి అమ్మినట్లు తెలిపింది. తనకు రావాల్సిన రూ.27 లక్షల్లో పొలం అమ్మేందుకు మధ్యవర్తిగా ఉన్న సిద్ధప్ప అప్పుగా రూ.16 లక్షలు తీసుకుంటాడని, మిగతా డబ్బును రంగస్వామి తర్వాత ఇస్తానని చెప్పి సంతకాలు చేయించుకొని మోసం చేయించుకున్నట్లు చెప్పింది. తర్వాత పలుమార్లు డబ్బు అడిగితే బెదిరిస్తున్నారని, తొమ్మిదెకరాల పొలం కోల్పోయి ప్రస్తుతం కూలీ పని చేసుకుంటూ బతుకుతున్నామని కన్నీటి పర్యంతమయ్యారు. తమకు న్యాయం చేయకపోతే చావే శరణ్యమని ఎమ్మెల్యేకు వివరించడంతో స్పందించిన ఆయన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానన్నారు. తమపై అడ్డగోలుగా తప్పుడు వార్తలు ప్రచురించే ఎల్లో మీడియా ఇప్పుడు ఎక్కడుంది. ఇలాంటి నిజాలు వెలుగులోకి తీసుకురావాల్సిన బాధ్యత లేదా అని ఎద్దేవా చేశారు.

# ఉపాధి పనుల్లో రూ.8 వేల అవినీతి



సామాజిక తనిఖీ సభలో మాట్లాడుతున్న డ్వామా పీడీ అమరనాథ్‌రెడ్డి

మంత్రాలయం: ఉపాధి హామీ పనుల్లో రూ.8,422 అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీలో బయటపడింది. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ కార్యక్రమం చేపట్టారు. చిలకలడోణలో రూ.3,234, కాచాపురంలో రూ.1,218, మాలపల్లిలో రూ.964, రాంపురంలో రూ.238, సుంకేశ్వరి రూ.2,600 బూదూరులో రూ.168 అవినీతి జరిగినట్లు తేల్చారు. అలాగే పనుల్లో నిర్లక్ష్యం చేయడంతో రూ.18 వేలు జరిమానా విధించారు. అత్యధికంగా వగరూరులో రూ.6 వేలు, అత్యల్పం బూదూరు, చెట్నిహళ్లి, సూగూరు గ్రామాల బాధ్యులకు రూ.వెయ్యి చొప్పున జరిమానా వేశారు. అవినీతి సొమ్మును త్వరలోనే రికవరీ చేయాలని పీడీ ఆదేశించారు. ఉపాధి పనుల్లో అవినీతికి తావులేకుండా చూసుకోవాలని మండల అధికారులకు సూచించారు. అడిషనల్ పీడీ మాధవీలత, ఏపీడీ లోకేశ్వర్, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ భాస్కర్, అంబుడ్స్‌మెన్ చంద్రశేఖర్, ఎంపీడీఓ మణిమంజరి, సీఆర్పీ మల్లికార్జున, ఈఓపీఆర్‌డీ ప్రభావతి, ఏపీఓ తిమ్మారెడ్డి, పీఆర్ ఏఈ నరసింహులు పాల్గొన్నారు.

## రైతులను ఆదుకోవడంలో విఫలం

ఆదోనిరూరల్: ఈ యేడాది తీవ్ర కరువుతో దుర్భరమైన పరిస్థితిలో రైతాంగం కూరుకుపోయిందని, ఆదుకోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అజయ్‌బాబు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య అన్నారు. ఈ మేరకు గురువారం ఎన్జీవోస్‌హోమ్ సమావేశ మందిరంలో రైతుసంఘం నియోజకవర్గ అధ్యక్షుడు నరసప్ప అధ్యక్షతన తాలూకా రైతు సంఘం మహాసభను నిర్వహించారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏపీ రైతుసంఘం తాలూకా గౌరవాధ్యక్షుడిగా లక్ష్మిరెడ్డి, తాలూకా అధ్యక్ష కార్యదర్శులుగా నరసప్ప, యల్లప్పలతో పాటు మరికొందరితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# మౌలిక వసతుల కల్పనే లక్ష్యం



ఆదోని 10వ వార్డులో సమస్యలను తెలుసుకుంటున్న మనోజ్‌కుమార్ రెడ్డి

ఆదోనిటౌన్: వార్డుల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, చైర్‌పర్సన్ బోయ శాంత పని చేస్తున్నారని యువనేత మనోజ్ కుమార్ రెడ్డి తెలిపారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని 10వ వార్డులో చైర్‌పర్సన్ బోయ శాంత, వైస్ చైర్మన్ గౌస్, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, కౌన్సిలర్లతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ముందుకుసాగారు. ప్రజా సమస్యలను ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తీసుకెళ్తూ వీలైనంత త్వరగా పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా, కౌన్సిలర్లు వసీం, చిన్నా, చలపతి, అశోక్, ఉస్మాన్, రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాజగోపుర నిర్మాణానికి రూ.లక్ష విరాళం



దాతలకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి గురువారం భక్తులు విరాళం అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రామాంజినేయులు, ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. దొడ్డిమేకల (పెద్దకడబూరు)వాస్తవ్యులు బెస్త బుడ్డమ్మ, చిన్నఉరుకుంద వారి కుటుంబ సభ్యులు రూ.1,00,116లను దేవాలయ కార్యాలయంలో అందజేసినట్లు తెలిపారు. ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం దాతలచే స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలు, పూలమాల, శేష వస్త్రాలు,లడ్డూలు,బాండు, స్వామివారి ఫొటోను అందజేశారు.అర్చకుడు నాగరాజ్‌స్వామి పాల్గొన్నారు.

**అన్నదాన పథకానికి విరాళం**

ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి గురువారం కౌతాళం మండలంలోని బాపురం గ్రామానికి చెందిన వీరేష్‌ఆచారి, శివకుమార్‌ఆచారి వారి కుటుంబ సభ్యులు రూ.51 వేల విరాళాన్ని ఆలయ కార్యాలయంలో అందజేసినట్లు అధికారులు తెలిపారు. దేవస్థాన సీనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## 'ఆడుదాం ఆంధ్ర' కిట్ల పంపిణీ



పంచాయతీ కార్యదర్శులకు కిట్లు అందజేస్తున్న నాయకులు

మంత్రాలయం: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ఆడుదాం-ఆంధ్ర' కార్యక్రమానికి సంబంధించి మంజూరైన కిట్లను గురువారం ఆయా గ్రామ పంచాయతీలకు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భీమారెడ్డి చేతుల మీదుగా పంచాయతీ కార్యదర్శులకు కిట్లు అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమం చేపట్టినట్లు భీమారెడ్డి పేర్కొన్నారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ విశ్వనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ మణిమంజరి, ఈఓపీఆర్‌డీ ప్రభావతి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం ధ్వంసం



మద్యం ప్యాకెట్లను ధ్వంసం చేస్తున్న పోలీసులు

మంత్రాలయం: మాధవరం పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన కర్ణాటక మద్యాన్ని డీఎస్పీ సీతారామయ్య ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. గురువారం మాధవరం చెక్‌పోస్టు వద్ద 2,496 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను కారుతో తొక్కించి ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. స్టేషన్ పరిధిలో 16 మద్యం కేసులకు సంబంధించిన లిక్కర్‌ను ధ్వంసం చేయడం జరిగిందన్నారు. ఎవరైనా అక్రమంగా మద్యం తరలింపు, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. సీఐ శ్రీనివాసులు, ఎస్ఐలు కిరణ్‌బాబు, వేణుగోపాల్‌రాజు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## కోలుకోలేక మహిళ మృతి

ఆదోనిరూరల్: మండలంలోని కడితోట గ్రామానికి చెందిన బోయ అంజినమ్మ (52) కర్నూలులోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం రాత్రి మృతిచెందింది. గురువారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు పెద్దతుంబళం ఎస్ఐ చిన్నపీరయ్య తెలిపారు. అంజినమ్మ ఈనెల 9వ తేదీన ఉపాధి హామీ పనికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా అదే పనికి వెళ్లిన గ్రామానికి చెందిన వ్యక్తి వెనక నుంచి స్కూటర్‌తో ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలైంది. చికిత్స నుంచి ఆదోని ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక అంజినమ్మ మృతి చెందింది.

## కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

ఆదోనిరూరల్: ఆస్పరి మండలం బిణిగేరికి చెందిన అడివి రాముడు అనే వ్యక్తి విరుపాపురం గ్రామ సమీపంలో కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తుండగా గురువారం తాలూకా పోలీసులు పట్టుకుని అరెస్టు చేసినట్లు తాలూకా ఎస్ఐ ఎర్రిస్వామి తెలిపారు. సదరు వ్యక్తి నుంచి 90 ఎంఎల్. పరిమాణం గల 40 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

## జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్తు



మాట్లాడుతున్న జేసీఎస్ టౌన్ కన్వీనర్ వెల్లాల మధుసూదనశర్మ

ఆదోనిఅర్బన్: పట్టణంలోని 29వ వార్డులో గురువారం కౌన్సిలర్ నాగరత్నమ్మ అధ్యక్షతన 'ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్నే ఎందుకు కావాలి' కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, పట్టణ అధ్యక్షుడు దేవా, జేసీఎస్ టౌన్ కన్వీనర్ వెల్లాల మధుసూదనశర్మ మాట్లాడుతూ.. రాష్ట్రంలో వివక్ష, అవినీతికి తావు లేకుండా అర్హులైన ప్రతిఒక్కరికీ ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగనన్నకే దక్కిందన్నారు. ప్రగతి బోర్డును ఆవిష్కరించి వార్డులో లబ్ధిదారులకు అందించిన సంక్షేమ పథకాలను వెల్ఫేర్ సెక్రటరీ మీనా వివరించారు. కౌన్సిలర్ ఫయాజ్, వార్డు ఇన్‌చార్జి మమ్మత్‌స్వామి, కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వివాహిత ఆత్మహత్య

కౌతాళం: పొదలకుంట గ్రామంలో వివాహిత వేధింపులకు తాళలేక పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన మీనమ్మ (22)ను అదే గ్రామానికి చెందిన భీమిరెడ్డికి ఇచ్చి ఏడు నెలల క్రితం వివాహం జరిపించారు. వీరి సంసారం మూడు నెలలు సాఫీగా సాగింది. తరువాత భర్తతో పాటు ఆ ఇంటి సభ్యుల నుంచి వేధింపులు మొదలయ్యాయి. వేధిపులు తాళలేక బుధవారం రాత్రి పుట్టినింటికి వచ్చిన మీనమ్మ పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తన కూతురి మృతికి అత్తింటి వారే కారణమని పేర్కొంటూ తల్లి కత్తి ఎల్లమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు మృతురాలి భర్త భీమిరెడ్డి, బావ నర్సింహులు, మామ రామిరెడ్డి, అత్త హనుమంతమ్మపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## వీధిలైట్ల ఏర్పాటు

కోసిగి: మండల పరిధిలోని ఐరన్‌గల్లు గ్రామంలో సర్పంచ్ రామాంజనేయులు వీధిలైట్లు ఏర్పాటు చేయించారు. గురువారం గ్రామంలో పర్యటించి వీధిలైట్లు ఫెయిల్ అయిన చోట కొత్త లైట్లు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టారు. గ్రామంలో ఈ నెల 16వ తేదీన ఆంజనేయ స్వామి ప్రభోత్సవం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు పారిశుద్ధ్య పనులు చేయించారు. తాగునీరు, వీధిలైట్లు, పారిశుధ్య పనులు చేయించి ప్రజల ఇబ్బందులు పరిష్కరించారు.